
సాక్షి ప్రకాశం

శుక్రవారం । 24 । మార్చి । 2023



మొండి జబ్బుకు తిత్తి తీస్తాం

క్షయ వ్యాధి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాయి. నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం... - 8లో..



వరాల వసంతం

నింగిలో నెలవంక కనిపించడంతో ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. నేటి నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.



ఇఫ్తార్ : సా॥ 06:28 ని॥ శుక్రవారం

సహర్ : ఉ॥ 04:52 ని॥ శనివారం

రంజాన్ వేళలు

యాంటీబయాటిక్స్

వద్దే..వద్దు..!



కరోనా విజృంభణ తర్వాత యాంటీబయాటిక్స్ వినియోగం పెరిగిపోయింది. ఎలాంటి వైరల్ రోగాలు సోకినా ఇష్టారాజ్యంగా వీటిని వాడటం పరిపాటిగా మారింది. అది కూడా వైద్యుడి సలహా లేకుండానే. ప్రతి చిన్నదానికీ ఇలా మందులు వాడటం ఆరోగ్యానికి హానికరంగా మారుతోంది. 2019 ముందు వీటి వినియోగం అంతంత మాత్రంగా ఉన్నా.. ఆ తర్వాత భారీగా పెరిగిపోయింది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులు సైతం చిన్న చిన్న రోగాలకు వీటిని రాస్తుండటంతో ప్రజలు ప్రధానంగా కిడ్నీ, లివర్ సమస్యల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు ఔషధ నియంత్రణ శాఖ, ఇటు వైద్యారోగ్య శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- చిన్న జ్వరానికే హెవీ యాంటీబయాటిక్స్
- వాటి ప్రభావానికి కిడ్నీ, లివర్ పాడవుతున్నట్లు గుర్తించిన వైద్యులు
- గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలపై ఆధారపడుతున్న జనం
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో విక్రయాలు
- జిల్లా వ్యాప్తంగా 3 వేల మందికిపైగా ఆర్ఎంపీలు, 1,802 మెడికల్ షాపులు
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న వైద్యారోగ్య, ఔషధ నియంత్రణ శాఖల అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఆర్ఎంపీలు చిన్నా పెద్దా తేడా లేకుండా ఏ రోగానికైనా యాంటీబయాటిక్స్ రాయడం.. మెడికల్ షాపులు కనీసం ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇష్టారాజ్యంగా వాటిని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం షరామామూలైంది. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. అయితే, ఇష్టారాజ్యంగా పెద్ద పెద్ద జబ్బులకు సైతం వచ్చీరాని వైద్యం చేస్తూ సైడ్ ఎఫెక్ట్స్ వచ్చేందుకు కారణమవుతున్నారు. కొంతమంది ఆర్ఎంపీలైతే పరిధి దాటి యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వంటివి ఇవ్వడంతో రోగులకు వేగంగా ఉపశమనం కలిగినా భవిష్యత్తులో కిడ్నీలు, లివర్‌కు సంబంధించిన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇక కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే.. హెవీ యాంటీబయాటిక్స్ వలన సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తేటతెల్లమవుతున్నాయి. యాంటీబయాటిక్స్‌ను మోతాదుకు మించి వాడితే మరింత అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని సీనియర్ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల బాధ్యత వహించాల్సిన వైద్యారోగ్య శాఖ, మెడికల్ షాపులను నియంత్రించాల్సిన ఔషధ నియంత్రణ శాఖల అధికారులు మొక్కుబడి తనిఖీలతో కాలక్షేపం చేస్తూ మామూళ్లకు అలవాటుపడి పట్టీపట్టనట్లు వ్యవహరించడం వలన ఈ పరిస్థితులు మరింతగా ఏర్పడుతున్నాయన్నది బహిరంగ రహస్యం.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఔషధాల విక్రయం...

జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి పైగా ఆర్ఎంపీలు ఉన్నట్లు సమాచారం. అలాగే హోల్‌సేల్, రిటైల్ మెడికల్ షాపులు అధికారికంగా 1,802 ఉన్నాయి. వాటిలో 400 హోల్‌సేల్ షాపులు ఉండగా, మిగిలినవన్నీ రిటైల్ షాపులే. ఈ షాపుల్లో అనధికారికంగా ఒక మోస్తరు వైద్యం కూడా చేస్తున్నారు. అంతేగాకుండా ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే హెవీ యాంటీబయాటిక్స్‌ను వినియోగదారులకు అంటగడుతూ ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నారు. మెడికల్ షాపులపై తనిఖీలు చేయాల్సిన ఔషధ నియంత్రణ శాఖ అధికారులు షెడ్యూలు ప్రకారమే తనిఖీలు చేస్తామని, లేదా.. ఏదైనా ఫిర్యాదులు అందితేనే తనిఖీలు చేస్తామని చెప్పడం గమనార్హం. జిల్లాలో 2021 నుంచి 2023 వరకు షాపులను తనిఖీ చేసి 176 షాపులు డాక్టర్ ఇచ్చిన మందుల చీటీ లేకుండానే మందులు విక్రయించినట్లు కేసులు నమోదు చేశారు. దీన్నిబట్టి మూడేళ్లలో కేవలం ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించిన షాపులు 176 అని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చెప్పడం గమనార్హం. సామాన్య ప్రజలను అడిగినా.. దాదాపు ప్రతి మెడికల్ షాపులో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తారనే విషయం చెబుతారు. కానీ, ఆ శాఖ అధికారులకు కనపడకపోవడం విడ్డూరం.

వైరల్ జ్వరాలకు యాంటీబయాటిక్స్ అవసరం లేదు



సాధారణ జ్వరాలు, వైరల్ జ్వరాలకు దాదాపుగా యాంటీబయాటిక్స్ అవసరం లేదు. బ్యాక్టీరియల్ జ్వరాలు తీవ్రంగా ఉంటే నిర్దేశిత మోతాదులో మాత్రమే యాంటీబయాటిక్స్ వాడాలి. అయితే, కొంతమంది ఆర్ఎంపీలు, మెడికల్ షాపులు మోతాదుకు మించి యాంటీబయాటిక్స్ ఇస్తున్నారు. దీనివలన భవిష్యత్తులో కిడ్నీ, లివర్ వ్యాధులతో పాటు రక్తహీనత, కాళ్లవాపులు వంటివి వస్తాయి. ప్రజలు అవగాహనతో ఉండి సరైన వైద్యులను సంప్రదించి ఔషధాలు వినియోగించాలి.

– **డాక్టర్ సీహెచ్ సుధాకర్**, ప్రొఫెసర్, అనాటమీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ, ప్రభుత్వ వైద్య కళాశాల

యాంటీబయాటిక్స్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలి



అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ వాడటం వలన కలిగే నష్టాలను ప్రజలు తెలుసుకుని అవగాహనతో ఉండాలి. ప్రథమ చికిత్స కోసం ఆర్ఎంపీలను కలిసినా తగ్గకుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎలిజిబుల్ డాక్టర్లను సంప్రదించి సరైన వైద్యం తీసుకోవాలి. ఎక్కువ మోతాదులో యాంటీబయాటిక్స్ వాడటం వలన సైడ్ ఎఫెక్ట్స్‌తో పాటు వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. పరిధి దాటి వైద్యం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపులు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే సహించేది లేదు. ప్రజలు సొంత వైద్యం మానుకుని డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మేరకు మాత్రమే ఔషధాలు వినియోగించాలి.

– **ఏఎస్ దినేష్‌కుమార్**, కలెక్టర్

ప్రిస్క్రిప్షన్ లేకుండా ఔషధాలు విక్రయిస్తే సహించం

మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఔషధాలు విక్రయిస్తే సహించేది లేదు. కఠిన చర్యలు తీసుకుని లైసెన్స్‌లు రద్దు చేస్తాం. అవసరమైతే షాపులు సీజ్ చేస్తాం. అంతే గాకుండా సరైన డాక్యుమెంట్లు లేకుండా షాపుల్లో ఫార్మసిస్ట్ లేకుండా ఉన్నా తగిన చర్యలు తీసుకుంటాం. 2021 నుంచి 2023 వరకు జిల్లాలో 1,903 తనిఖీలు నిర్వహించాం. వాటిలో 176 కేసులు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించినవే. తనిఖీలు చేసిన షాపుల్లో ఉన్న లోపాలపై తగిన చర్యలు తీసుకున్నాం.

– **డాక్టర్ పీటీ సంధ్య**, ఔషధ నియంత్రణ అధికారి

న్యూస్‌రీల్

డీఆర్వోగా శ్రీలత

- కనిగిరి ఆర్డీవోగా అజయ్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీగా ఉన్న రామిశెట్టి శ్రీలతను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా కనిగిరి ఆర్డీవోగా టి.అజయ్‌కుమార్‌ను నియమించారు. ఇప్పటివరకు కనిగిరి ఆర్డీవోగా ఉన్న సందీప్‌కుమార్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లి హెచ్‌ఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా బదిలీ చేశారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.వరకుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్‌గా కె.మాధురిని నియమించారు. ఎం.వెంకటేశ్వరరావును పూల వెలిగొండ ప్రాజెక్టు ల్యాండ్ ఎక్విజేషన్ ఎస్‌డీసీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్‌లు

ఒంగోలు: జిల్లాలో ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్ లిస్తూ ఎస్పీ మలికాగర్గ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌బీలో పనిచేస్తున్న వైవీ రమణయ్యను కొండపికి, పుల్లలచెరువు పీఎస్‌లో పనిచేస్తున్న వి.సుధాకర్‌ను టీవీ పల్లి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

28, 29 తేదీల్లో దివ్యాంగులకు శిబిరాలు

ఒంగోలు: దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందజేసేందుకు నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని డాన్‌బాస్కో స్కూల్‌లో ఈ నెల 28న, మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 29న శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 17 సంవత్సరాల వయసు గల దివ్యాంగ విద్యార్థులు అర్హులని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లచే విద్యార్థులకు సంబంధించిన వైకల్యాన్ని నిర్ధారణ చేసి వినికిడి యంత్రం, వీల్‌చైర్, మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, అంధులకు వాకింగ్ స్టిక్, సీపీ చైర్, ఐడీటీఎల్ ఎం కిట్ (మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులకు) వంటి ఉపకరణాలు సూచించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి దివ్యాంగ విద్యార్థులు వారితో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సదరం సర్టిఫికెట్ జెరాక్స్, ఆధార్‌కార్డు జెరాక్స్, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీ జెరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. గుర్తించిన దివ్యాంగ విద్యార్థులకు అలింకో, ఎన్ఐఈపీఐడీ వారి ద్వారా ఉచిత ఉపకరణాలను అతి త్వరలో అందించనున్నట్లు వివరించారు. వివరాలకు సహిత విద్యా విభాగం కో ఆర్డినేటర్ (9908424620) సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో కాపీయింగ్

- పట్టుబడిన విద్యార్థి

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం -1బీ పరీక్షలో కాపీయింగ్‌కు పాల్పడి ఒక విద్యార్థి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. స్థానిక సరస్వతీ జూనియర్ కాలేజీ సెంటర్‌లో పరీక్షలు నిర్వహిస్తుండగా చీఫ్ సూపరింటెండెంట్ ఒక విద్యార్థిని కాపీతో సహా పట్టుకున్నారు. హైస్కూలు టీచర్ ఇన్విజిలేషన్ డ్యూటీలు చేస్తున్నట్లుగా గుర్తించి ఆయనను తదుపరి పరీక్షల విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ఆర్ఐవో మాట్లాడుతూ గురువారం గణితం 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలు జరిగాయని, జనరల్ విభాగంలో 24,210 మంది విద్యార్థులకుగానూ 23,044 మంది, ఒకేషనల్ విభాగంలో 3,859 మంది విద్యార్థులకుగానూ 3,104 మంది హాజరయ్యారన్నారు. జనరల్ విభాగంలో 1,166 మంది, ఒకేషనల్ విభాగంలో 755 మంది వెరసి 1,921 మంది హాజరయ్యారు. ఆర్ఐవో 5 సెంటర్లను, డీఈసీ, డీవీఈవో, హెచ్‌పీసీ కమిటీ సభ్యులు 10 సెంటర్లను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 37 సెంటర్లను తనిఖీ చేశాయి. కాపీయింగ్ చేస్తూ పట్టుబడిన విద్యార్థి వివరాలను మాల్ ప్రాక్టీసింగ్ పర్యవేక్షణ కమిటీకి పంపుతామని, తదుపరి చర్యలను కమిటీ నిర్ణయిస్తుందని ఆర్ఐవో తెలిపారు.



అస్వస్థతకు గురైన విద్యార్థిని తరలిస్తున్న సీఐ

స్పృహ తప్పిన విద్యార్థిని

మార్కాపురం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాస్తున్న విద్యార్థిని ఆకస్మికంగా అస్వస్థతకు గురికావడంతో బందోబస్తు నిమిత్తం అక్కడికి వెళ్లిన సీఐ భీమానాయక్ తన వాహనంలో పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మార్కాపురం పట్టణంలోని సాధన జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు కలుజువ్వలపాడు కస్తూరిబా జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం.నిత్య హాజరయ్యారు. పరీక్ష రాస్తున్న సమయంలో స్పృహ తప్పడంతో సిబ్బంది గమనించి బయటకు తెచ్చారు. అక్కడే ఉన్న సీఐ.. తన వాహనంలో ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయించారు.

ప్రభుత్వం దృష్టికి ఉప్పు రైతుల సమస్యలు

- కలెక్టర్ దినేష్‌కుమార్
- మోటుమాల, పాదర్తి గ్రామాల్లో రీ సర్వే పరిశీలన

కొత్తపట్నం: ఉప్పు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. కొత్తపట్నం మండలంలోని మోటుమాల, పాదర్తి గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. రీ సర్వే పనుల పురోగతిని అధికారులనడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో రీ సర్వే పూర్తయింది.. ఇంకా ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని ప్రశ్నించారు. 81ఏ, 81బీలో ఎక్కువ ఖాళీ స్థలం ఎందుకు ఉంది.? అందులో ఏం చేస్తారని ఆరా తీశారు. వరద వచ్చినప్పుడు, సముద్రం నుంచి ఆటుపోట్లు వచ్చినప్పుడు భూమంతా నీటితో నిండిపోతుందని కలెక్టర్‌కు స్థానికులు వివరించారు.



ఉప్పు సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఉప్పు సాగు పరిశీలన...

రీ సర్వే పరిశీలన అనంతరం మోటుమాల గ్రామ పరిధిలో ఉప్పు సాగును కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ఉప్పు తయారీ విధానం గురించి రైతులనడిగి తెలుసుకున్నారు. ఉప్పు ఎలా తయారు చేస్తారు, ఎన్ని రోజులకు ఉప్పు ఉత్పత్తి అవుతుంది, బ్యాగ్ ఎంతకు విక్రయిస్తారు, తదితర వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు ఉప్పు సాగుచేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. అదేవిధంగా ఉప్పు నిల్వ చేసుకోడానికి సరైన వసతులు లేక తక్కువ ధరకే అమ్ముకుంటున్నామని, ప్రభుత్వం నుంచి రాయితీలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. తమ పిల్లలు చదువుకున్నప్పటికీ సరైన ఉపాధి లేక ఉప్పు కొఠారు పనులు చేసుకుంటున్నారని, వారికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉప్పు రైతుల సమస్యలు ఎన్నో ఉన్నాయని, ఎంతో కష్టపడితేనే ఉప్పు సాగవుతుందని అన్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎంత విస్తీర్ణంలో ఉప్పు సాగు చేస్తున్నారు, ఉప్పు సాగుపై ఆధారపడి జీవిస్తున్న రైతుల వివరాలను సమగ్రంగా సేకరించాలని తహసీల్దార్ బీవీ రమణారావును ఆదేశించారు. చదువుకున్న యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తామన్నారు. గ్రామంలో ఇలాంటి యువత ఎంత మంది ఉన్నారో సర్వే నిర్వహించి వారి విద్యార్హతలను సేకరించాలని వెల్ఫేర్ అసిస్టెంట్ సీతారామయ్యను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు తహసీల్దార్ మురళి, కొత్తపట్నం తహసీల్దార్ బీవీ రమణారావు, సర్వేయర్ జిలాని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఒంగోలు: లౌకిక భారత్ రక్షణకై షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థి, యువజనులు ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. జాతీయ విప్లవవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో స్థానిక కోలాస్ హోటల్ వద్ద నుంచి చర్చిసెంటర్ వరకు గురువారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ బ్రిటీష్ తెల్లదొరల పాలనే కాదు.. నల్లదొరల దోపిడీ కూడా లేకుండా పోవాలన్నారు. సంపూర్ణమైన స్వాతంత్ర్యం కావాలని పోరాడిన షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసి 92 సంవత్సరాలు అవుతోందన్నారు. అయినా.. వారు కోరుకున్న సమాజం నేటికి సిద్ధించలేదన్నారు. నేడు దేశాన్ని అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ వంటి అనేక సామ్రాజ్యవాద దేశాలు దోచుకుంటున్నాయన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి నేడు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతోందన్నారు. నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వాల్లో మాత్రం చలనం లేదన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారన్నారు. లౌకిక, ప్రజాస్వామిక విలువలను నాశనం చేస్తున్నారన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ చేస్తోందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో భగత్‌సింగ్ చరిత్రను తొలగించి ఆర్ఎస్ఎస్ నేత హెగ్డేవార్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టి విద్యార్థులకు అశాస్త్రీయ భావాలను ఎక్కిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పర జాలన్న తదితరులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల నాయకులు

భారత వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: భారత వాయుసేనలో అగ్నివీర్-వాయు ఉద్యోగాలకు ఆన్‌లైన్ ద్వారా పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన సంక్షేమ శాఖ మరియు స్టెప్ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.బాబూరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నివీర్ వాయు ఉద్యోగాలకు ఇంటర్/డిప్లొమో పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు హెచ్‌టీటీపీఎస్://అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

విద్య, ఇతర అర్హతలు...

సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్ ఎంపీసీ 50 శాతం మార్కులతో లేదా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్ 50 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. 3 సంవత్సరాల డిప్లొమా కోర్సు చేసి ఉండాలన్నారు. సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు 50 శాతం మార్కులతో ఇంటర్ లేదా 50 శాతం మార్కులతో రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. 17 సంవత్సరాల 6 నెలల నుంచి 21 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. 2002 డిసెంబర్ 26వ తేదీ నుంచి 2006 జూన్ 26వ తేదీ మధ్య జన్మించి ఉండాలన్నారు. శారీరక దారుఢ్యంలో పురుష అభ్యర్థుల ఎత్తు 152.5 సెంటీమీటర్లు, మహిళా అభ్యర్థుల ఎత్తు 152 సెంటీమీటర్లు, ఎత్తుకు తగ్గ బరువు, పురుష అభ్యర్థుల ఛాతి 77 సెంటీమీటర్లు ఉండి గాలిపీల్చినప్పుడు 5 సెంటీమీటర్ల వ్యాకోచం చెందాలన్నారు. మహిళా అభ్యర్థులు గాలి పీల్చినప్పుడు ఛాతి 5 సెంటీమీటర్లు వ్యాకోచం చెందాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20వ తేదీ నాటికి ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ టెస్టుకు 3 రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్ కార్డులను అభ్యర్థుల ఈ-మెయిల్ ఐడీలకు పంపడం జరుగుతుందన్నారు. అర్హత పరీక్ష, మెరిట్ లిస్టు పరీక్ష ముగిసిన నెలలోపు వెబ్‌సైట్‌లో వివరాలు ఉంచడం జరుగుతుందన్నారు. తదుపరి విద్యార్హత పత్రాల పరిశీలన, శారీరక దారుఢ్య పరీక్షల్లో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగుపందెంను పురుష అభ్యర్థులు 7 నిముషాల్లో, మహిళా అభ్యర్థులు 8 నిముషాల్లో పూర్తిచేయాలన్నారు. ఎంపికైన వారిని షార్ట్ టర్మ్ సర్వీస్ కింద అగ్నివీర్ వాయు సర్వీస్‌లోకి తీసుకుంటారని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టెప్ సీఈవో బాబూరావు కోరారు.

'నాడు-నేడు'తో సుందరంగా పాఠశాలలు



శ్లాబ్ నిర్మాణానికి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న నాడు-నేడు పథకం చారిత్రాత్మకమైనదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.26 కోట్లతో నిర్మిస్తున్న 10 అదనపు తరగతి గదుల శ్లాబ్ నిర్మాణానికి గురువారం వారు పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలన్నీ సుందరంగా తయారవుతున్నాయన్నారు. వాటి ద్వారా విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. చీమకుర్తి పట్టణంలో బాలికలకు నూతనంగా మంజూరైన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో ఎంతో మంది బాలికలు చదువుకోవడానికి తోడ్పాటు అందుతోందన్నారు. నాడు-నేడు ద్వారా అదనపు తరగతి గదుల నిర్మాణాలు కూడా మొదలు కావడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి బాలికలకు మౌలిక సదుపాయాలు అందుతాయని బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్ణపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గోపురపు చంద్ర, పేరం శ్రీనివాసరావు, పాలడుగు సుబ్బారావు, ఎంఈవో టీ రవి, టీచర్లు నల్లూరి వెంకటేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, ఎల్.నారాయణమ్మ, కే నాగమణి, పీ గోవిందమ్మ, ఎల్.జ్యోతి, డీ వరలక్ష్మి, వీఎస్ కామేశ్వరి, ఎస్ఎల్ఎస్ పార్వతి, పీ హోగ్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బూచేపల్లి వెంకాయమ్మను సన్మానిస్తున్న మహిళలు

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

టంగుటూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొండపి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కొత్తపట్నం మండలం కాంచీనగరం కాలనీకి చెందిన సింగోతు వెంకటేశ్వర్లు(24) కృష్ణపట్నం అత్తగారి ఇంటి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో కొండపి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సంఘటనా స్థలానికి ఎస్సై ఖాదర్‌బాషా చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హనుమంతునిపాడు: మండల పరిధిలో కంభం కనిగిరి రహదారిలో మల్లవరం ఆవులవారిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాలరాజు(38) మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై జి.కృష్ణపావని తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

తల్లి హత్య కేసులో కుమారుడికి జీవితకాల శిక్ష

మార్కాపురం: మద్యం మత్తులో తల్లిని చంపిన కుమారుడికి జీవిత కాల శిక్ష విధిస్తూ మార్కాపురం జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజవెంకటాద్రి గురువారం తీర్పు చెప్పినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గాంధీరెడ్డి తెలిపారు. నిందితుడు యోహాన్ తన భార్య కుమారితో కలిసి దోర్నాల మండలం హసానబాద్‌లో నివాసం ఉంటున్నాడు. తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో 2016 మార్చి 10న యోహాన్ తన భార్యతో గొడవ పడుతుండగా తల్లి దేవమ్మ అడ్డురావడంతో ఆగ్రహించి విచక్షణ కోల్పోయి దేవమ్మను గొడ్డలితో దాడి చేయడంతో ఆమె మృతి చెందింది. దీనిపై అప్పటి యర్రగొండపాలెం సీఐ రవికుమార్, ఎస్సై నాగరాజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్ష్యాలు రుజువు కావడంతో గురువారం నిందితునికి జీవితకాల శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సరైన సమయంలో సాక్ష్యలను ప్రవేశపెట్టి నిందితునికి శిక్ష పడేలా చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందికి ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.


శతాధిక వృద్ధురాలు మృతి

అద్దంకి రూరల్: అద్దంకిలోని దామావారిపాలెం బ్రహ్మంగారి దేవస్థానం వద్ద నివాసం ఉంటున్న శతాధిక వృద్ధురాలు అద్దంకి అంజమ్మ (109) గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనమళ్లు, మనమరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్లు కలిపి మొత్తం 40 మంది వరకు సంతానం ఉన్నారు. ఆమె భర్త నారాయణ 30 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు అన్ని నెరవేర్చింది. ఎప్పుడూ ఎలాంటి అనారోగ్యానికి గురికాలేదని, రెండురోజుల క్రితం వరకు తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

మొండి జబ్బుకు తిత్తి తీస్తాం!

- క్షయ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పటిష్ట చర్యలు
- 2025–30 నాటికి పూర్తిగా నిర్మూలించే దిశగా అడుగులు
- జిల్లాలో 4,544 మంది వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ప్రస్తుతం 1,729 మందికి చికిత్స
- రోగులకు 6 నెలలపాటు ఉచితంగా ఔషధాలు, పౌష్టికాహారం
- రూ.3 వేల నుంచి రూ.10 లక్షల వరకు మందులు ఉచితం

నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం



ఒంగోలు అర్బన్: క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా జిల్లాలో క్షయ నివారణ శాఖ కృషి చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు క్షయ నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు ప్రభుత్వాలు 2025–30 నాటికి క్షయను పూర్తిగా నిర్మూలించే దిశగా అడుగులు వేస్తున్నాయి. నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

మందులు ఉచితం

జిల్లాలో క్షయ నివారణ చర్యలు పక్కాగా సాగుతున్నాయి. క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయిలో క్షయ లక్షణాలు ఉన్న వారిని గుర్తించడం, వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు రోగ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. అంతేకాకుండా వైద్య పరీక్షల నుంచి కోలుకునే వరకు రోగులకు అవసరమైన మందులతోపాటు పౌష్టికాహారం ఉచితంగా ఇస్తున్నారు. సాధారణ క్షయ అయితే అటువంటి రోగగ్రస్తులకు 6 నెలలకు రూ.3 వేల విలువ చేసే మందులు, వ్యాధి 6 నెలల్లో తగ్గకుంటే అటువంటి వారికి 9 నుంచి 20 నెలల వరకు రూ.3 లక్షల విలువ చేసే మెడిసిన్స్, మొండి క్షయ ఉన్న వారికి రూ.10 లక్షల విలువైన బెడాక్విలిన్ మందులు ఉచితంగా అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. బెడాక్విలిన్ తీసుకుంటున్న వారు జిల్లాలో 75 మంది ఉన్నారు.

రోగులకు పౌష్టికాహారం కిట్లు

మెడిసిన్స్ మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం క్షయ రోగులకు చికిత్సా కాలంలో 6 నెలలపాటు నెలకు రూ.500 వ్యయంతో పౌష్టికాహారం అందజేస్తున్నారు. 2022లో క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్సా కాలంలో నెలకు రూ.500 చొప్పున ఇప్పటి వరకు రూ.26,27,500 అందజేశారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద క్షయ రోగులను దత్తత తీసుకునే వారిని ఎంపిక చేసి ఆరు నెలల పాటు ఒక్కో రోగికి రూ.700 చొప్పున మొత్తం రూ.4200 నగదు ఇవ్వడం లేదా పోషకాహారం ఇస్తున్నారు. క్షయ బాధితుల కుటుంబ సభ్యులకు తరచూ పరీక్షలు నిర్వహించి టీబీ ప్రివెంటివ్ థెరపీ ద్వారా సంరక్షిస్తున్నారు.

క్షయ వ్యాధి లక్షణాలు ఇవీ..

రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, శరీరం బరువు తగ్గడం, దగ్గినపుడు కళ్లెలో రక్తం పడటం, చాతి ఎక్స్‌రేలో అనుమానాస్పద మరకలు తదితర లక్షణాలు ఉంటాయి. క్షయ బాధితులు తుమ్మినపుడు తుంపర్ల ద్వారా ఇతరులకు కూడా వ్యాధి సోకుతుంది. సుగర్, క్యాన్సర్, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు, హెచ్ఐవీ ఉన్న వారికి, మద్యం, పొగ తాగేవారికి, పోషకాహార లోపం, గనుల్లో పనిచేసే వారికి క్షయ సోకే అవకాశం ఎక్కువగా ఉంది.

క్షయపై అవగాహన అవసరం



క్షయను నిర్మూలించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిని గుర్తించి ప్రజలు వ్యాధిపై అవగాహనతో ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. రోగ లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించుకుని తగిన చికిత్సను క్షయ నివారణ శాఖ ద్వారా పొందాలి. రోగ లక్షణాలు ఉండి నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు కలుగుతుంది. ముందే అవగాహనతో ఉంటే క్షయ వ్యాధిని నివారించి ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చు.

– ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా కలెక్టర్

క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడం, రోగులు క్రమం తప్పకుండా మెడిసిన్ వాడుతున్నారా లేదా అనే అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. కలెక్టర్ సూచనల మేరకు ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నాం. రోగులకు పౌష్టికాహారం ప్రభుత్వం తరఫున అందజేస్తున్నాం. వైద్యుల సూచనల మేరకు క్షయ బాధితులు మందులు వాడితే సురక్షితంగా ఉంటారు. ఆ దిశగా రోగులకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. రూ.10 లక్షల విలువ చేసే బెడాక్విలిన్ మందును సైతం అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందంటే క్షయ వ్యాధి నివారణపై ఎంత చిత్తశుద్ధితో ఉందో అర్థమవుతుంది.

– డాక్టర్ సురేష్, క్షయ నివారణ అధికారి

జిల్లాలో 12 టీబీ యూనిట్లు

కళ్లె, తెమడ పరీక్షలు, ఆర్‌టీపీసీఆర్, సీబీనాట్ పరీక్షల ద్వారా క్షయ వ్యాధిని గుర్తిస్తారు. జిల్లాలో 12 టీబీ యూనిట్లు, 64 మైక్రోస్కోపిక్ కళ్లె పరీక్ష కేంద్రాలు, 17 ఆర్‌టీపీసీఆర్(రియల్ టైం పాలమరైజ్ చైన్ రియాక్షన్) కేంద్రాలు, 2 సీబీనాట్ (కేట్రాడ్జి బేస్డ్ న్యూక్లిక్ యాసిడ్ ఆఫ్లిఫికేషన్ టెస్ట్) కేంద్రాలు ఉన్నాయి.



నేడు క్షయ అవగాహన ర్యాలీ

ఒంగోలు అర్బన్: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి సురేష్ తెలిపారు. స్థానిక టీబీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రకాశంభవనం వద్ద కలెక్టర్ దినేష్‌కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తారన్నారు. అనంతరం రిమ్స్ గ్యాలరీలో క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు కనీస మద్దతు ధర

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్రంలో రైతులంతా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో సకాలంలో వర్షాలు కురవడంతో పంటలు బాగా పండుతున్నాయన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు వ్యవసాయానికి కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రైతుల కళ్లల్లో సంతోషం చూడాలనే లక్ష్యంతో గత 4 ఏళ్ల నుంచి వ్యవసాయాన్ని అన్ని విధాలుగా కాపాడుతున్నారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని సకాలంలో అందించడం, పంట నష్టపోయిన రైతులకు కూడా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సకాలంలో సకాలంలో అందిస్తూ అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలకు ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించి రూ.3వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయమన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉత్పత్తులకు కూడా ఆలస్యం లేకుండా నగదు అందుతుందన్నారు.

వరాల వసంతం

- నింగిలో కనిపించిన నెలవంక
- మొహల్లాల్లో రంజాన్ హడావుడి
- గురువారం రాత్రి నుంచి ప్రారంభమైన తరావీహ్ నమాజ్
- నేటి నుంచి ముస్లింల ఉపవాసాలు



ఒంగోలు టౌన్: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. గురువారం రాత్రి నింగిలో నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం మొదలైనట్లు మత పెద్దలు ప్రకటించారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంగా విశ్వశించే ముస్లింలు ఈ నెలంతా ఉపవాసాలు, ప్రత్యేక నమాజులు, దానధర్మాలతో గడుపుతారు. రోజు మొత్తంలో ఎక్కువ భాగం ఆరాధనలో ఉంటారు. వరాల వసంతం రంజాన్‌లో అల్లా భక్తుల పాపాలను క్షమిస్తాడని, ఎంత ఎక్కువగా పుణ్యం చేస్తే అంతగా పాపాలు క్షమించబడతాయని బలంగా నమ్ముతారు.

తరావీహ్ ప్రత్యేకత

పవిత్ర గ్రంథాన్ని కంఠస్తం చేసిన హాఫీజ్, ముఫ్తీలు తరావీహ్ చదవుతారు. ఆకాశంలో నెలవంక దర్శనం కావడంతో గురువారం రాత్రి నుంచి తరావీహ్ చదవడం మొదలైంది. రాత్రి ఇషా నమాజు తరువాత అదనంగా 20 రకాతులను ఆచరించారు. రంజాన్ మాసం ముగింపునకు చిహ్నంగా ఆకాశంలో నెలవంక కనిపించిన రోజు రాత్రితో తరావీహ్ చదవడం నిలిపివేస్తారు. తదుపరి రోజున ఈద్గా మైదానంలో ఉల్లాసభరిత వాతావరణంలో సామూహికంగా రంజాన్ నమాజ్ చదివి పండగ చేసుకుంటారు.

నిష్ఠతో ఉపవాసాలు

రంజాన్ అనగానే మనకు గుర్తుకు వచ్చేది ఉపవాసాలే. 12 ఏళ్ల బాలల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఆరోగ్యంగా ఉండే వారంతా విధిగా ఉపవాసాలు ఉంటారు. ఉదయం సూర్యోదయానికి ముందే లేచి సహర్ చేస్తారు. తరువాత రోజంతా ఒక్క గుటక మంచినీరైనా తాగకుండా దీక్ష కొనసాగిస్తారు. చివరికి ఉమ్మిని కూడా మింగడానికి లేదు. అంత నిష్ఠగా ఉపవాసాలు కొనసాగిస్తారు. సాయంత్రం సూర్యాస్తమయం తరువాత ఇఫ్తార్‌తో ఆ రోజు ఉపవాసాన్ని ముగిస్తారు. ఇలా ఇంటిల్లిపాది నెలంతా ఉపవాసం ఉంటారు. ఒకవేళ ఏదైనా అనారోగ్యంతో ఉపవాసం ఉండలేకపోతే అలాంటి వారు రంజాన్ తర్వాత వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

పది రోజులకో ప్రత్యేకత

30 రోజుల ఉపవాసంలో ప్రతి 10 రోజులకూ ఓ ప్రత్యేకత ఉంది. మొదటి 10 రోజులను కారుణ్య దినాలుగా భావిస్తారు. అల్లా కారుణ్యం కోరుతూ ఈ పది రోజులు ఉపవాసం ఉంటారు. 11 నుంచి 20వ రోజు వరకు క్షమాభిక్ష దినాలు అంటారు. తమ పాపాలను క్షమించమని అల్లాను వేడుకుంటూ ఉపవాసాలు ఉంటారు. చివరి పది రోజులను నరకాగ్ని నుంచి కాపాడమని కోరుతూ దువా చేస్తూ ఉపవాసం ఉంటారు.

సహర్‌కు ఏర్పాట్లు

హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థులు, కుటుంబానికి దూరంగా ఉంటూ ఉద్యోగాలు చేసుకునే వారి కోసం ఒంగోలు నగరంలోని మసీదులతోపాటుగా జిల్లాలోని అనేక మసీదుల్లో సహర్ ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో నిద్ర లేచి సహర్ కోసం వంట చేసుకోవడం కష్టమైన పని కాబట్టి అలాంటి వారి కోసం ఆయా పట్టణాలు, గ్రామాల్లోని కొందరు యువకులు కమిటీలుగా ఏర్పడి దాతల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ నెల మొత్తం ఉచితంగా సహర్ చేసే వీలుంటుంది.



మసీదులు కిటకిట

జిల్లాలో 480 మసీదులు ఉన్నాయి. రంజాన్ మాసం మొదలు కావడంతో ఒంగోలు నగరంలోని 32 మసీదులతోపాటు అన్ని ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రోజూ 5 పూటలా నమాజు చేసే వారితోపాటుగా అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలు మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటును కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సాయంత్రం ఇఫ్తార్ సమయంలో ఒక గంట ముందే ఇంటికి వెళ్లేందుకు అనుమతి మంజూరు చేశారు. నేటి నుంచి ఏప్రిల్ 23 వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగాల పేరుతో మోసం

- నిందితుడు కంభం మండలం రావిపాడు వాసి
- పదుల సంఖ్యలో యువతీయువకులకు ఉద్యోగాల ఎర
- రూ.1.47 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఐదుగురు బాధితుల ఆవేదన


చిలకల శివారెడ్డికి పంపిన ఇంటర్వ్యూ లెటర్

బేస్తవారిపేట: రైల్వే శాఖలో ఔట్‌సోర్సింగ్ కింద ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగుల నుంచి ఓ వ్యక్తి నగదు తీసుకుని మోసం చేసిన ఉదంతమిది. ఉద్యోగాలు ఇప్పించకపోగా.. తాము ఇచ్చిన డబ్బు తిరిగివ్వకుండా తప్పించుకుతిరుగుతున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని కంభం సీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు చెప్పారు. వారి కథనం మేరకు.. కంభం మండలం రావిపాడుకు చెందిన భూతపాటి శామ్యూల్ అనే వ్యక్తి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ.. బేస్తవారిపేట మండలంలోని అక్కపల్లెకు చెందిన చిలకల వెంకట సురేంద్రరెడ్డి, చిలకల శివారెడ్డి, చిలకల అమూల్య, కామిరెడ్డి శివారెడ్డిని నమ్మించాడు. వీరి నుంచి రూ.1.20 లక్షల నగదును ఫోన్ పే ద్వారా తన ఖాతాలో జమ చేయించుకున్నాడు. అలాగే సోమవారిపేట గ్రామానికి చెందిన గోదిన వెంకట నారాయణ నుంచి రూ.27 వేల నగదు తీసుకున్నాడు. ఫిబ్రవరి 19వ తేదీన ఇంటర్వ్యూలకు హాజరు కావాలంటూ యాప్‌జెన్ టెక్నాలజీస్, చెన్నై పేరుతో ఫేక్ కాల్ లెటర్లు పంపాడు. సౌత్ సెంట్రల్ రైల్వేలో ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో సూపర్‌వైజర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సూపర్‌వైజర్ పోస్టులు, ఏడాదికి రూ.3.36 లక్షల నుంచి రూ.రూ.3.55 లక్షల వేతనం అంటూ కాల్ లెటర్‌లో పేర్కొన్నాడు. ఇంటర్వ్యూ తేదీ దగ్గర పడగానే శామ్యూల్ ఫోన్ ఎత్తడం మానేయడంతో బాధితులకు అనుమానం వచ్చింది. చుట్టు పక్కల మండలాలకు చెందిన పలువురు నిరుద్యోగులను ఇదే తరహాలో శామ్యూల్ నమ్మించి డబ్బు గుంజాడని బాధితులు చెప్పారు.

గంజాయి గుట్టు రట్టు

- అక్రమంగా తరలిస్తుండగా 40 కేజీల గంజాయి స్వాధీనం
- నలుగురిని అరెస్టు చేసిన సింగరాయకొండ పోలీసులు


సీజ్ చేసిన గంజాయిని చూపుతున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: గంజాయి అక్రమ రవాణాను ఛేదించి నలుగురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 40 కేజీల స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..ఈ నెల 23వ తేదీ గురువారం ముందస్తు సమాచారంతో సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై షేక్ ఫిరోజ్ ఫాతిమా సిబ్బందితో పాతసింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డినగర్‌లో తనిఖీలు నిర్వహించగా...కాలనీలో నివాసం ఉంటున్న నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం అలగాయపాలెంకు కోడూరి రాములమ్మ వద్ద 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆమెను విచారించారు. రాములమ్మ చెప్పిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో తనిఖీలు నిర్వహించగా అదే జిల్లాలోని కందుకూరు మున్సిపాలిటీ శ్రీనగర్ కాలనీలో నివసిస్తున్న కట్టా రంగయ్య, కట్టాకుమారి, కట్టా జీవన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మరో 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా పేర్కొన్నారు. గంజాయి ముఠా గుట్టురట్టు చేసిన సీఐ రంగనాథ్, ఎస్సై ఫిరోజ్‌ఫాతిమాలను ఎస్పీ మల్లికాఖర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.